
క్లుప్తంగా

గౌడీయ మఠంలో డోలోత్సవం ప్రారంభం



రామానంద గౌడీయ మఠంలో శ్రీరాధాకృష్ణులు

కొవ్వూరు: స్థానిక శ్రీ రామానంద గౌడీయమఠంలో శ్రీరాధాకృష్ణుల డోలోత్సవం, శ్రీకృష్ణ జయంతి మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం అయ్యాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. డోలోత్సవ నిర్వహణకు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. సుందరంగా అలంకరించిన వనంలో శ్రీరాధాకృష్ణులను ఊయల ఉంచారు. ఉదయం శ్రీకృష్ణ నామ సంకీర్తన చేశారు. శ్రీపాద కృష్ణ ప్రసాద్ భాగవత కథ వినిపించారు. సాయంత్రం సంధ్యా హారతి ఇచ్చారు. విబుధ వామన మహరాజు, దోర్బల ప్రభాకరశర్మలు డోలోత్సవం విశిష్టతను తమదైన రీతిలో వివరించారు.ఈనెల 19 వరకూ శ్రీరాధాకృష్ణుల డోలోత్సవం, 20 నుంచి 26 వరకూ భాగవత గోష్టి, 27 నుంచి శ్రీకృష్ణ జయంతి మహోత్సవం, 28న నంద మహారాజుల ఆనందోత్సవం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు వివరించారు. రోజూ నామ సంకీర్తనలు, భజనలు కొనసాగుతాయన్నారు. సాయంత్రం పూట స్వామి వారికి డోలోత్సవం, పండితుల ఉపన్యాసాలు ఉంటాయన్నారు.

రోగులకు 'మానవత' ఆర్థిక సాయం



దూబచర్లలో రోగికి ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

నల్లజర్ల: మండలంలోని దూబచర్ల, అచ్చన్నపాలెం గ్రామాల్లో అనారోగ్యాలతో బాధపడుతున్న ముగ్గురికి మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో రూ.24 వేల ఆర్థిక సాయం చేశారు. దూబచర్లకు చెందిన మందపాటి వీరబాబుకు రూ.10,000, అచ్చన్నపాలేనికి చెందిన ముళ్ళపూడి సుబ్బాయమ్మకు రూ.5 వేలు, అదే గ్రామానికి చెందిన పెయ్యాల గంగకు రూ.5 వేల చొప్పున శుక్రవారం ఆ సంస్థ ప్రతినిధులు ఆర్థిక సాయం చేశారు. పెయ్యాల గంగకు అదనంగా అచ్చన్నపాలెం మాజీ సర్పంచ్ పాతూరి విజయరాధ రూ.4 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమాల్లో కండెపు వెంకట సూర్యనారాయణ, భోగవల్లి వెంకట సుబ్బారావు, ఐడీవీ అప్పారావు, కూచిపూడి ఉదయ భాస్కరరావు, దావులూరి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల సీఐగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



నల్లజర్ల: స్థానిక సీఐగా ఎస్. శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఏసీబీ సీఐగా విజయవాడలో పని చేస్తూ బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఇంత వరకూ నల్లజర్ల సీఐగా పని చేసిన దుర్గాప్రసాద్ వీఆర్‌కు వెళ్లారు. బాధ్యతలు స్వీకరించాక సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎవరికి ఎటువంటి ఇబ్బంది ఉన్నా నేరుగా వచ్చి సమస్యలు చెప్పి తగు పరిష్కారం పొందవచ్చన్నారు. శాంతిభద్రలు, ట్రాఫిక్ సమస్యల నివారణకు తగు చర్యలు తీసుకుంటానన్నారు.

క్యాన్సర్ రోగికి ఆర్థిక సహాయం

గోపాలపురం: స్థానిక రజక పేటకు చెందిన ఏలూరి ప్రసాద్ అనే యువకుడు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. అతని కుటుంబానికి గోపాలపురానికే చెందిన మద్దిపాటి సతీష్‌బాబు శుక్రవారం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రసాద్ ఆరోగ్య పరీక్షల నిమిత్తం దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌ల పంపిణీ

నిడదవోలు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. తర్వాత మంత్రి దుర్గేష్‌ను అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. అనంతరం పట్టణంలోని సామాజిక ఆసుపత్రిలో రూ. 3 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన ఎక్స్‌రే యూనిట్‌ను శుక్రవారం మంత్రి కందుల దుర్గేష్ వైద్యులతో కలిసి ప్రారంభించారు. వార్డుల్లో పర్యటించి రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. కార్యక్రమాల్లో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షేక్ ఫయాజ్, డాక్టర్లు పి.వినీల్, రెహనా, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, డీఈఈవో జే. సుబ్రహ్మణ్యం, సమగ్ర సర్వశిక్ష అభియాన్ డీఈ ఎస్. శ్రీనివాస్, ఎంఈఓ కేవీఎస్‌వి. గురుమూర్తి, ప్రిన్సిపాల్, బి.మేరీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

అనాథల సేవలో తరిస్తూ..

- ఆశ్రయం కల్పిస్తున్న శ్యామలాదేవి
- అంబేడ్కర్ ట్రస్ట్ ద్వారా సేవ
- 25 మంది వృద్ధులకు ఆశ్రయం



వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న అనాథ వృద్ధులు

దేవరపల్లి: అనాథ వృద్ధులను మండలంలోని కృష్ణంపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ వయోవృద్ధుల ఆశ్రమం అక్కున చేర్చుకుంటోంది. వృద్ధులను ఆదరిద్దాం..అక్కున చేర్చుకుందాం... అనే నినాదంతో ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారు జి.శ్యామలాదేవి. ఇక్కడ ఉచితంగా భోజనం, వసతి, వైద్యం అందిస్తున్నారు. 2015లో రామన్నపాలెం వద్ద అద్దె ఇంట్లో ముగ్గురు వృద్ధులతో ఆశ్రమాన్ని స్థాపించారు. రోడ్డు విస్తరణలో అద్దె ఇంటిని తొలగించడంతో కృష్ణంపాలెంలో ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. దాతలు, గ్రామస్తుల తోడ్పాటుతో గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారి పక్కనే రేకుల షెడ్డు నిర్మించి, ప్రస్తుతం వృద్ధులకు ఆశ్రమం కల్పిస్తున్నారు. ప్రస్తుతం 25 మంది ఉంటున్నారు.

దాతల సహకారం..

ఆశ్రమానికి దాతల సహకారం మెండుగా ఉంది. ఎంతోమంది దాతలు ఆశ్రమాన్ని సందర్శించి వృద్ధులకు తమ వంతు సాయం అందజేస్తున్నారు. ఉద్యోగులు, న్యాయవాదులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆశ్రమానికి తమ వంతు సహకారం అందిస్తూ మీకు మేమున్నాం అంటు భరోసా కల్పిస్తున్నారు. నూతన దుస్తులు, నిత్యావసరాలు, మంచాలు, బియ్యంతో పాటు ఆర్థిక సాయం అందజేస్తున్నారు. పుట్టిన రోజు, పెండ్లి రోజు వంటి శుభకార్యాలను ఆశ్రమంలో నిర్వహిస్తూ ఇక్కడి అనాథ వృద్ధుకు చక్కటి భోజన ఏర్పాట్లు చేస్తున్నారు.

అంత్యక్రియల బాధ్యత కూడా..

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల అనాథలు ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు. తొలుత 50 మంది వరకూ వృద్ధులు ఉండేవారు. వారిలో 32 మంది మృతి చెందారు. వారిలో 27 మృత దేహాలకు నిర్వాహకురాలు శ్యామలాదేవి దహన సంస్కారాలు నిర్వహించారు. ఆమె సేవలను గుర్తించిన పలు సంస్థలు సేవా పురస్కారాలు అందజేశాయి. హైదరాబాద్‌లోని హోప్ థియోలాజికల్ యూనివర్సిటీ డాక్టర్ ఆఫ్ బెస్ట్ సోషల్ సర్వీస్ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. గతంలో మహాత్మాగాంధీ నేషనల్ ఎక్సలెంట్ అవార్డు, సావిత్రీబాయ్ పూలే నేషనల్ ఫెలోషిప్ అవార్డు, గుడ్ సమరిటన్ సంస్థ (విజయవాడ) నుంచి ఉత్తమ అవార్డు శ్యామలాదేవి అందుకున్నారు.

లాభాపేక్ష లేకుండా నిర్వహణ



లాభాపేక్ష లేకుండా ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నాను. నా తండ్రి గుదే వెంకటేశ్వరరావు అంబేడ్కర్ సేవాసమితి ద్వారా సుమారు 30 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన స్ఫూర్తితో ఈ ఆశ్రమం ఏర్పాటు చేసి తొమ్మిదేళ్లుగా అనాథ వయోవృద్ధులకు సేవలు అందిస్తున్నాను.

– జి. శ్యామలాదేవి, ఆశ్రమం నిర్వాహకురాలు, కృష్ణంపాలెం, దేవరపల్లి మండలం

పిల్లలు ఉండి కూడా అనాథను



నాది నిడదవోలు. ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు సంతానం. వాళ్లు పట్టించుకోలేదు. భార్యతో కలసి ఆశ్రమంలో ఉంటున్నాం. అనారోగ్యంతో భార్య చనిపోయింది. అంత్యక్రియలు ఆశ్రమం నిర్వాహకురాలు శ్యామలాదేవి చేశారు. ఎనిమిదేళ్లుగా ఆశ్రమంలోనే ఉంటున్నాను. పిల్లలు ఉండి కూడా అనాథను. వయస్సు సరిపోనందున ప్రభుత్వం పింఛన్ ఇవ్వడం లేదు. ఆశ్రమంలో బాగా చూస్తున్నారు.

– గంటా వెంకటేశ్వరరావు, కృష్ణంపాలెం

ఎవరూ లేని అనాథను



నా భర్త, నలుగురు పిల్లలూ చనిపోయారు. పూర్తిగా అనాథను. ఐదేళ్లుగా ఆశ్రమంలో ఉంటున్నాను. భోజనం, వసతి, మందులు అన్నీ ఉచితంగా అందిస్తున్నారు. మా స్వగ్రామం తాడేపల్లిగూడెం మండలం, ఆరుగొలను. ఆశ్రమంలో ఆదరణ బాగుంది. శ్యామలాదేవి సొంత బిడ్డగా చూస్తున్నారు.

– ఉండ్రాజవరపు నాగమణి, వృద్ధాశ్రమం, కృష్ణంపాలెం

కళ్లెదుటే పూడ్చేస్తున్నా కనిపించదా?

మునిపల్లిలో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ స్థలం



మునిపల్లి పంచాయతీ భవనం వద్ద ఆక్రమించి పూడ్చేస్తున్న ఖాళీ స్థలం

నిడదవోలు రూరల్: ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. మండలంలోని మునిపల్లి గ్రామ పంచాయతీ భవనం పక్కన ఉన్న పంచాయతీ, ఆర్‌అండ్‌బీ స్థలాన్ని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమించి గ్రావెల్ రాళ్లతో పూడ్చేస్తున్నారు. ఇదంతా కళ్లముందే కనిపిస్తున్నప్పటికీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. గ్రామంలోని పలు కాలనీల నుంచి మురుగు వెళ్లేందుకు ప్రధానమైన ఈ డ్రైన్ పూడ్చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలపై పంచాయతీ కార్యదర్శి ఎస్.రత్నమాలిక గతేడాది నోటీసులు జారీ చేశారు. కానీ ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. ఇప్పటికైనా పంచాయతీ, ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలను ఆక్రమణకు గురికాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

గోపవరంలో బైక్ చోరీపై కేసు

నిడదవోలు రూరల్: మండలంలోని గోపవరం గ్రామంలో జరిగిన బైక్ చోరీపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ శుక్రవారం తెలిపారు. కడియం మండలం బుర్రిలంకకు చెందిన తాళం నరేష్ ఈనెల 3న అత్తవారింటికీ గోపవరం వచ్చాడు. ఇంటిముందు పార్కింగ్ చేసిన సుజికీ బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. దీనిపై బాధితుడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ పేర్కొన్నారు.

ప్రమాదకరంగా వంతెన రెయిలింగ్



మల్లవరంలో పేముల కాలువపై ప్రమాదకరంగా వున్న వంతెన రెయిలింగ్

చాగల్లు: పేముల కాలువపై మండలంలోని మల్లవరం గ్రామంలో గతంలో నిర్మించిన వంతెన రెయిలింగ్ ప్రమాదకరంగా ఉంది. ఈ వంతెన రెయిలింగ్ కొన్నేళ్లుగా ఇలాగే ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ మార్గంలో నిత్యం అనేక మంది రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయాల్లో ఈ మార్గంలో ప్రయాణించేవారు ప్రమాదాలు బారిన పడతారేమోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. దెబ్బతిన్న వంతెన రెయిలింగ్‌కు సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.


వాహనచోదకులకు హెల్మెట్ల పంపిణీ



వాహనచోదకులకు ఉచితంగా హెల్మెట్లు అందజేస్తున్న ఎంవీఐ మహ్మద్ జమీర్, ఫాదర్ థామస్

దేవరపల్లి: రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాల్సిన ఆవశ్యకతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా యర్నగూడెంలోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రయాణికులకు కలిగే ఉపయోగాలను కొవ్వూరు మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) మహ్మద్ జమీర్ వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రయాణంలో హెల్మెట్, సీట్ బెల్ట్ విధిగా ధరించాలని ఆయన సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంది తలకు బలమైన గాయమై, మృతి చెందుతున్నారని ఆయన గుర్తు చేశారు. స్కూల్ యాజమాన్యం ద్విచక్రవాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు అందజేసింది. కార్యక్రమంలో స్కూల్ హెడ్ మిస్ట్రెస్ రెవరెండ్ ఎలిసీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్



నిడదవోలులో అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్



కొవ్వూరులో అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

- రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్
- నిడదవోలులో మంత్రి, కొవ్వూరులో ఎమ్మెల్యే ముప్పిడి ప్రారంభం

నిడదవోలు: పేదల ఆకలి తీర్చాలనే ఆలోచనతోనే రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్లను రాష్ట్రవ్యాప్తంగా పునః ప్రారంభిస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. నిడదవోలు 27వ వార్డు, గణేష్ చౌక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్‌లో రూ. 5 కే భోజనం, రూ. 5 కే అల్పాహారం అందిస్తారన్నారు. పేదల ప్రయోజనార్థం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లకు దాతలు విరాళాలు అందించాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ టి.రాంభూపాల్ రెడ్డి, మున్సిపల్ ఆర్‌వో వెంకటేశ్వరరావు, ఏఈ సామవేదం హేమంత్ పాల్గొన్నారు.

కొవ్వూరు: స్థానిక బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. హాజరైన జనానికి కొద్ది సేపు ఎమ్మెల్యే ముప్పిడి, కూటమి నాయకులు అల్పాహారం వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, నాయకులు దాయన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్,బీవీ ముత్యాలరావు పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతలకు సత్కారం



మున్సిపల్ అధికారులు హేమంత్ కమల్ శ్రీనివాస్, సుజాత, వెంకటేశ్వరరావులను సత్కరిస్తున్న చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: ఉతమ సేవలకు గాను స్వాతంత్ర్య దినోత్సవం నాడు రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాలు స్వీకరించిన ముగ్గురు నిడదవోలు మున్సిపల్ అధికారులను మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ఘనంగా సన్మానించారు. ఆ ముగ్గురూ మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ ఎస్. హేమంత్ కమల్ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ కె.సుజాత, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకటేశ్వరరావులు. వారిని శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, మునిసిపల్ కమిషనర్ టి. రాంభూపాల్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

200 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న ట్రైనీ విద్యార్థులు

నల్లజర్ల: వెంకట్రామన్నగూడెం వెటర్నరీ యూనివర్సిటీ ట్రైనీ విద్యార్థులు శుక్రవారం మండలంలోని ఆవపాడు గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ సేవా శిబిరం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఆవపాడు పంచాయతీ సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 200 పశువులకు ట్రైనీ విద్యార్థులు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మీరాసాహెబ్, నల్లజర్ల పశుసంవర్ధకశాఖ ఏడీ జాన్ మోజెస్ వెస్లీ, పశువైద్య సహాయకుడు రాంబాబు, వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రానికి బల్లల బహూకరణ

దేవరపల్లి: మండలంలోని సంగాయగూడెంలోని రైతు భరోసా కేంద్రానికి దాతలు బల్లలు బహూకరించినట్టు సర్పంచ్ కరుటూరి ఉషారాణి తెలిపారు. గ్రామానికి చెందిన రైతు పిన్నమనేని వీర్రాజు తన తండ్రి వెంకట్రాజు పేరున సుమారు రూ.40 వేల విలువైన బల్లలను అందజేసినట్టు ఆమె తెలిపారు. భరోసా కేంద్రంలో రైతులు కూర్చోవడానికి ఫర్నిచర్ లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నట్టు ఆమె తెలిపారు. రైతుల ఇబ్బందులను గమనించిన దాత వీర్రాజు బల్లలు అందజేసినట్టు ఆమె చెప్పారు. దాతను పలువురు రైతులు అభినందించారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



మద్దూరు హైస్కూల్లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సీతారామాంజనేయులును సత్కరిస్తున్న నాయకులు

కొవ్వూరు: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కించుకున్న మండలంలోని మద్దూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కట్టుంగ సీతారామాంజనేయులును శుక్రవారం ఆ పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఆ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సీతారామాంజనేయులు సైన్స్ ఫెయిర్ ద్వారా ఎన్నో అవార్డులు పొంది పాఠశాలకు గుర్తింపు తెచ్చారని వక్తలు కొనియాడారు. సైన్స్ ఫెయిర్ ద్వారా పాఠశాలను జాతీయ స్థాయి వరకూ తీసుకెళ్లారని పేర్కొన్నారు. మద్దూరు సర్పంచ్ ఉప్పులూరి ముని రాజేంద్రప్రసాద్(బాబ్జీ), ఎంపీటీసీ సభ్యుడు ఎ.నాగ రాజు, మాజీ ఉప సర్పంచ్ నాయుడు వీర్రాజు, పాఠశాల మేనేజ్‌మెంటు కమిటీ చైర్మన్ రాంబాబు, ప్రధానోపాధ్యాయురాలు వై.సుబ్బలక్ష్మి, ఇతర ఉపాధ్యాయులు సీతారామాంజనేయులు దంపతులను ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

సిలిండర్ల స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: డొమెస్టిక్ (గృహ) సిలిండర్ల వినియోగంలో అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయీస్ అధికారులు శుక్రవారం శాటిలైట్ సిటీ మెయిన్ రోడ్డులో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక ఫుడ్ ప్లాజాలో వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్న ఐదు డొమెస్టిక్ (గృహ) సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఫుడ్ ప్లాజా యజమాని సోముపై 6ఏ కేసు నమోదు చేశారు. తనిఖీలలో విజిలెన్స్ అధికారి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిరులిచ్చే తల్లీ.. ప్రణామాలు

- ఊరూరా భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు
- ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు
- పూలు, పండ్లతో అమ్మవారికి నైవేద్యాలు



దేవరపల్లిలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో వరలక్ష్మీ పూజలు



తాళ్లపూడి రాజ్యలక్ష్మి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న మహిళలు



బ్రాహ్మణగూడెంలో భక్తుల పూజలు అందుకున్న కనకదుర్గమ్మ



పాలంగిలో కనకదుర్గమ్మకు కరెన్సీ నోట్లతో అలంకరణ

దేవరపల్లి: శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా భక్తులు అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. మహిళలు ఇళ్ల వద్ద వరలక్ష్మీ దేవిని ప్రతిష్ఠించి కుంకుమ పూజలు చేశారు. పలు రకాల పండ్లు, పిండి వంటలను అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించారు. గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. యర్నగూడెంలోని అలివేలు మంగ, పద్మావతి కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం, దేవరపల్లిలోని శ్రీదేవీభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయాల్లో అమ్మవార్లకు సాయంత్రం 6 గంటల నుంచి కుంకుమ పూజలు నిర్వహించారు. యర్నగూడెంలో ఆలయ ధర్మకర్త శ్రీకాకొళపు కాశీవిశ్వనాథం దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో సుమారు 200 మంది ముత్తైదువలు పాల్గొన్నారు. పూజలో పాల్గొన్న భక్తులకు కాశీ విశ్వనాథం దంపతులు కుంకుమ, పసుపు, పూజాసామగ్రితో పాటు మహాలక్ష్మీ అమ్మవారి చిత్ర పటాలను అందజేశారు.

చాగల్లు: స్థానిక వల్లికుంటలోని కనకదుర్గమ్మ ఆలయంలోను, ధనలక్ష్మమ్మ ఆలయంలోను, ఊనగట్ల, బ్రాహ్మణగూడెం, మార్కొండపాడు, చిక్కాల, చంద్రవరం తదితర గ్రామాల అమ్మవార్ల ఆలయాల్లోనూ శ్రావణ శుక్రవారం పూజలు చేశారు. అమ్మవార్లను పట్టువస్త్రాలు, పూలమాలలతో గౌరీమాతగా అలంకరించారు. సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. చాగల్లు కనకదుర్గమ్మ ఆలయంలోను భక్తులు కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రావణమాసం శుక్రవారం కావడంతో మహిళలు ఇళ్ల వద్ద వరలక్ష్మీ వ్రతాలు, పూజలు నిర్వహించారు.

తాళ్లపూడి మండలంలో..

తాళ్లపూడి: ఈ ఏడాదే వివాహమైన కొత్తపెళ్లి కూతుళ్లు, ముత్తైదువలు శ్రావణ శుక్రవారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోదావరిలో స్నానాలు ఆచరించి ఉపవాసంతో 12 రకాల పిండి వంటకాలు వండి లక్ష్మీదేవికి నైవేద్యంగా సమర్పించారు. ముత్తైదువలకు వాయనాలు, పసుపు కుంకుమలు అందించి, వారి ఆశీస్సులు పొందారు. శ్రావణ శుక్రవారం కావడంతో తాళ్లపూడిలోని రాజ్యలక్ష్మి, కనకదుర్గమ్మ ఆలయాలు, మలకపల్లి గ్రామంలోని కనకదుర్గమ్మ ఆలయాన్ని అధిక సంఖ్యలో మహిళలు దర్శించుకుని పూజలు నిర్వహించారు. రాజ్యలక్ష్మీ దేవి ఆలయంలో అమ్మవారిని అర్చకుడు గోవర్ధనం చక్రవర్తి ఆధ్వర్యంలో పుష్పాలతో అలంకరించి పూజలు నిర్వహించారు.

ఉండ్రాజవరం: శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా పాలంగి గ్రామంలోని కనకదుర్గమ్మ వారు ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు అయ్యప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తణుకు, ఉండ్రాజవరం మండలాల నుంచి అధికంగా భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మోర్త, ఉండ్రాజవరం, కె.సావారం, చివటం తదితర గ్రామాల కనకదుర్గమ్మ ఆలయాలకు భక్తులు పోటెత్తారు.